క్లుప్తంగా

హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ



వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలుకు మహిళలు, యువత ఆసక్తి చూపుతున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్స్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ నగలు, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బీఎన్‌రెడ్డినగర్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంచేస్తే ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరంజనేయ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు రాంరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ యిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మకుటం సదాశివుడు, కుంట్ల నర్సింహ్మాయాదవ్, శాంతప్ప, బలవంత్‌రెడ్డి, సత్యనారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

మన్సూరాబాద్: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ, యూబీడీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్దచెరువులో సోమవారం ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రణాళికాబద్ధంగా కాలనీల్లో మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో యూబీడీ సిబ్బంది తేజస్వీ, నాయకులు ఎంజాల సురేష్, పాతూరి శ్రీధర్‌గౌడ్, మునగాల హరీష్‌రెడ్డి, గోపీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సత్యదేవ్ ఎన్‌క్లేవ్‌కాలనీలో ఏర్పాటు చేసిన పార్కును కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు పార్కులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్ సహకారంతో డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జంగయ్య, ప్రతినిధులు విజయ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రనాయక్, మమత, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



చంచల్‌గూడ: ఇంట్లో ఫర్నిచర్ పనులు చేయిస్తుండగా షాక్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగిన సంఘటన సోమవారం సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ ఏ కాలనీలోని సుముధుర అపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకుంది. అపార్ట్‌మెంట్‌లోని 5వ అంతస్తులో ఉంటున్న మురళీ మనోహర్‌రెడ్డి కబోర్డు పనులు చేయిస్తుండగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంటి యజమాని, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో దాదాపు రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు యాజమాని పేర్కొన్నారు.

హరితహారంతో పర్యావరణ పరిరక్షణ



ఎల్‌బీనగర్‌లోని ఆక్సిజన్ పార్కులో మొక్కలు నాటుతున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

- అటవీ విస్తీర్ణం 24 శాతం నుంచి 33 శాతానికి పెరుగుదల
- దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆక్సిజన్ పార్కు
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని, అందులో భాగంగానే హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ హరితోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కామినేని ఫ్లై ఓవర్ల కింద ఏర్పాటు చేయనున్న ఆక్సిజన్ పార్కులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాలతో అడవుల విస్తీర్ణం తగ్గుతుందని, దీంతో వాతావరణంలో మార్పులు ఏర్పడి వర్షపాతం తగ్గిపోతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని 2015లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. తెలంగాణలో అడవుల విస్తీర్ణం 24 నుంచి 33శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ పరంగానే కాకుండా ప్రజలను, రైతులను భాగస్వాములను చేసి హారితహారాన్ని ఉద్యమంలా చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏటా హారితహారం కార్యక్రమం ద్వారా లక్షల సంఖ్యలో మొక్కలను నాటుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కోరారు.

ప్రయోగాత్మకంగా ఆక్సిజన్ పార్కు

దేశంలో ఎక్కడ లేనివిధంగా అత్యుత్తమమైన ఆక్సిజన్ పార్కును కామినేని ఫ్లైఓవర్ల కింద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నాసా, ఢిల్లీ ఐఐటీ గుర్తించిన పూర్తిగా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే 26 రకాల మొక్కలను నాటడం జరుగుతుందన్నారు. పార్కుకు ఇరువైపుల పెద్ద జాలీలను ఏర్పాటు చేసి, వాటిపై మొక్కలు పాకే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రయోగాత్మకంగా మొట్టమొదటగా ఎల్‌బీనగర్‌లో ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఆస్తమా తదితర సమస్యలతో బాధపడుతున్న వారు ఈ పార్కులో వాకింగ్ చేయటం వల్ల ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు మారుతి దివాకర్, సురేందర్‌రెడ్డి హరికృష్ణయ్య, హార్టికల్చర్ డీడీ రాజ్‌కుమార్, మేనేజర్ మేధ, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు జక్కిడి మల్లారెడ్డి, అనంతుల రాజిరెడ్డి, ఈశ్వరమ్మయాదవ్, రాహుల్‌గౌడ్, పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, రుద్ర యాదగిరి, జక్కిడి రఘువీర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందమైన ఆకృతులు..

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ కామినేని ఫ్లైఓవర్ల కింద ఏర్పాటు కానున్న ఆక్సిజన్ పార్కులో సుందరమైన ఆకృతులను ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేశారు. 390 మీటర్ల విస్తీర్ణంలో 734 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. పార్కులో ప్రజలు, చిన్నారులను ఆకర్షించేందుకు వివిధ రకాల విభిన్నమైన సుందరమైన ఆకృతులను ఏర్పాటు చేయనున్నారు. వాకర్లు కూర్చునేందుకు ప్రత్యేకంగా సీట్లను ఏర్పాటు చేయటంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక సదుపాయాన్ని కల్పిస్తున్నారు.



పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: నియోజకవర్గ పరిదిలో పార్కు స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కాపాడుతున్నామని, ఇప్పటికే ఆక్రమణకు గురైన పార్కులను గుర్తించి కబ్జాల నంచి విడిపిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్‌లో రూ.1.30 కోట్లతో అభివృద్ధి చేసిన (చిల్డ్రన్స్)థీమ్ పార్కును ఆయన స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పార్కు స్థలాలను అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికీ 16 పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. హరిత హారంలో భాగంగా ఈ ఏడాది 5 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు కాలనీల్లో ఖాళీ స్థలాలను, రోడ్ల పక్కల స్థలాలను గుర్తించామన్నారు. హరిత హారం కార్యక్రమంతో రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందని ఇప్పటికి 7.5 శాతం అధికంగా గ్రీనరీని పెంపొందించామని దానిని 15 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారులు రాజ్‌కుమార్, వేద, నాయకులు బోడ భిక్షపతి, బండారి బాస్కర్, బాస్కర్‌సాగర్, మల్లీశ్వరిరెడ్డి, గుడాల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

హరిత హారంలో భాగస్వాములు కావాలి



హరిత హారం కార్యక్రమంలో పాల్గొన్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి

నాగోలు: హరిత హారం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. సోమవారం నాగోలులోని మమతనగర్ కాలనీలో నవ చైతన్య యువజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన హరిత హారం కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, నాగోలు సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి మొక్కలు నాటారు. సంఘం అధ్యక్షులు ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫతుల్లాగూడలో..

నాగోలు డివిజన్‌లో ఫతుల్లాగూడలోని డీఆర్‌ఎస్ సెంటర్‌లో సోమవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు దప్పు రాజు, కేశిరెడ్డి పద్మరెడ్డి, రావుల శ్రీనివాస్, అర్టికల్చర్ డిపార్మెంట్ అధికారులు పాల్గొన్నారు.



తన నివాసంలో మొక్కలు నాటుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చైర్ పర్సన్ జయరాజ్

చంపాపేట: నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా చేయడమే విద్యుత్ ఫోరం లక్ష్యమని ఫోరం చైర్‌పర్సన్ ఎన్ జయరాజ్ అన్నారు. సోమవారం చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ...విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, మీటరు, బిల్లు చెల్లింపులో సమస్యలు, కొత్త సర్వీస్ ఇవ్వటంలో అభ్యంతరాలు, జాప్యం, పేరు, కేటగిరీ మార్పిడి తదితర సమస్యలపై విద్యుత్ వినియోగదారులు తమ పూర్తి వివరాలతో పోస్ట్, ఫ్యాక్స్, వ్యక్తిగతంగా గాని వెంగళరావునగర్, ఎర్రగడ్డలోని ఫోరం కార్యాలయంలో అంద చేయాలన్నారు. సమస్య తీవ్రత ఆధారంగా 10 రోజుల నుంచి 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 15 మంది విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందగా, ఎనిమిది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు బి లలిత, శోభారాణి, గజేందర్, డీఈ సురేస్, ఏడీఈలు రాంచదర్, రాజేందర్, ఏఈ విజయకుమార్, వెంకట్రావ్, విజయ్‌కుమార్‌రెడ్డి, రణధీర్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ తదితరులు

నాగోలు: యువజన సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. సోమవారం నాగోల్‌లో నవ చైతన్య యువజన సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగోలు డివిజన్ కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్ మాట్లాడుతూ నవ చైతన్య యువజన సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సంఘం అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీత ప్రశాంత్‌గౌడ్ సహకారంతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, నాగోలు పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు, సంఘం ప్రధాన కార్యదర్శి స్వాతిన్‌గౌడ్, ట్రెజరర్ మధుగౌడ్, మాజీ అధ్యక్షులు బద్దం కుమార్ గౌడ్, చెర్కు శ్రీధర్‌గౌడ్, బద్దం మహేందర్‌గౌడ్, రమేష్‌గౌడ్, అనంతుల బాబు, సాయి, నవీన్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న విజయకుమార్ దంపతులు

నాగోలు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని క్లాస్‌మెట్స్ క్లబ్ హైదరాబాద్ నిర్వాహకులు పెండ్యాల విజయ కుమార్ దంపతులు అన్నారు. సోమవారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించిన రాంచరణ్‌తేజ్, కుమార్, సాయికుమార్‌లకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏటా 10 వ తరగతిలో పాఠశాల టపర్స్‌గా నిలిచిన ఇద్దరికి నగదు బహుమతులు అందజేస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ విజయ్‌కుమార్ లాంటి దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, గణేష్, కృష్ణారెడ్డి, వసంతబాయి పాల్గొన్నారు.

వరద కాలువ పనులు వేగవంతం చేయాలి



ఉదయ్‌నగర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టిన వరదనీటి కాలువ పనులను వేగవంతం చేయాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్య భారతితో కలిసి ఉదయ్‌నగర్, మల్‌రెడ్డినగర్ కాలనీల్లో వరదనీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. సర్కిల్ అధికారులు సురేష్, రాజు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు అనంతరెడ్డి, రాజవర్ధన్, చందర్, వేణుగోపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



గర్భిణులకు కిట్లను అందజేస్తున్న డాక్టర్ పులేందర్‌నాయుడు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ పులేందర్‌నాయుడు గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కిట్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకున్న గర్భిణులందరికీ కేసీఆర్ పౌష్టికాహార కిట్లను అందజేస్తామన్నారు. ప్రతి గర్భిణికి రెండు సార్లు ఈ కిట్లు అందజేయనున్నట్లు తెలిపారు. గర్భిణులు 1వ, 2వ త్రైమాసికంలో నమోదై ఉండి ఎటువంటి అబార్షన్లు నమోదుకానట్లయితే వారికి రెండు న్యూట్రిషన్ కిట్లు అందుతాయన్నారు. 3వ త్రైమాసికంలో నమోదు చేయబడి, ప్రసవం నమోదు కానట్లయితే ఒక్క కిట్‌కు మాత్రమే అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, హైదరాబాద్ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ హర్షద్ కేక్ కట్ చేశారు. మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాబు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, గ్రేటర్ ఓబీసీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, అక్బర్‌బాగ్ అధ్యక్షుడు మహేష్, తాహేర్ పాల్గొన్నారు.

భర్త హత్య కేసులో భార్యకు జైలు

రంగారెడ్డిజిల్లాకోర్టులు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన కేసులో నిందితురాలికి యావజ్జీవ శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా రెండవ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి భవానీ చంద్ర సోమవారం తీర్పు చెప్పారు. సెషన్స్ కోర్టు ఏపీపీ కస్తూరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీనగర్ ప్రాంతానికి చెందిన ప్రవళిక, పుల్లయ్య దంపతులకు ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన పుల్లయ్య భార్యా పిల్లలను వేధించే వాడు. ఈ క్రమంలో ప్రవళికకు పుల్లయ్య మేనల్లుడి(16)తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. 2016లో ఇంట్లో ప్రవళిక ప్రియుడితో కలిసి ఉండటాన్ని గుర్తించిన పుల్లయ్య వారిని నిలదీశాడు. దీంతో వారిద్దరు కలిసి అతడిని హత్య చేశారు. మృతదేహాన్ని మాయం చేసేందుకు బైక్‌పై నల్లగొండ వైపు తీసుకెళుతుండగా పెద్ద అంబర్‌పేట వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎల్‌బీనగర్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం సోమవారం తుది తీర్పు వెలువరించింది. కాగా మైనర్‌పై విచారణ కొనసాగుతోంది.

తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీ

హయత్‌నగర్: ఇంటి తాళాలు పగులగొట్టి రూ.6.5 లక్షల విలువైన నగలు, నగదు అపహరించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్‌లోని రేణుకా రెసిడెన్సీలో ఉంటున్న ఏలూరి లక్ష్మీ త్రివేణి ఈ నెల 3న నందిగామకు వెళ్లి 13న తిరిగి వచ్చింది. ఇంటి మెయిన్‌డోర్ తెరిచి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. ఆమె బీరువాలో ఉన్న 8 తులాల బంగారు నగలు, రూ. లక్ష నగదు, 50 గ్రాముల వెండి వస్తువుల, రెండు వాచీలు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. వారి సూచన మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంచి నీటి సమస్యను పరిష్కరించండి

ఎల్‌బీనగర్: నాలుగు రోజులుగా పలు కాలనీల్లో మంచి నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫిర్యాదు చేసినా వాటర్ వర్క్స్ అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసుదన్‌రెడ్డి ఆరోపించారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వారు సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ జలమండలి కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీసం ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయడం లేదని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంచి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు నవకిషోర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రావు, నరసింహారెడ్డి, రఘురాం నేత, శరత్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ



బియ్యాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

మన్సూరాబాద్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఆదరణ అనాథాశ్రమానికి అనుబంధంగా నడుస్తున్న అమితాబా ఆదరణ విద్యాలయానికి ఉచితంగా బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భరత్‌కుమార్‌యాదవ్, గద్దగూటి స్వామి, చల్లా రమేష్, పృథ్వీరాజు, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జ్యోతి

హయత్‌నగర్: గుడిసెలు వేసుకునేందుకు యత్నించిన పేదలపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని, వెంటనే కేసులను ఎత్తి వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి డిమాండ్ చేశారు. సాహెబ్‌నగర్ కాలనీ సర్వే నెంబర్ 71లో గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నించిన సీపీఎం కార్యకర్తలపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో -హయత్‌నగర్ తాహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ... పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట నిలబెట్టుకోకుండా ఇళ్ల స్థలాలు అడిగిన పేదలను అణిచి వేస్తున్నారని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేని ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు వందలాది ఎకరాలను అప్పనంగా కట్టబెడుతోందని ఆరోపించారు. నాయకులు కీసర నర్సిరెడ్డి, గొరెంకల నర్సింహ, నర్సింహ, తుమ్మల సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు 20 రోజుల జైలు

చంచల్‌గూడ: మద్యం మత్తులో గొడవకు దిగి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీకి చెందిన నినావత్ రవి ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇటీవల అతను మద్యం మత్తులో స్థానికంగా వీరంగం సృష్టించాడు. పోలీసులు వారించిన వినకుండా వారి విధులను అడ్డుకున్నాడు. దీంతో పోలీసులు ఈ పిటీ కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచారు. 7వ స్పెషల్ ఎంఎం కోర్టు నిందితుడికి 20 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

21న సరూర్‌నగర్‌లో యోగా డే

పంజగుట్ట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న తెలంగాణ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ గ్రౌండ్‌లో యోగా డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ చైర్మన్ శ్యామ్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో యోగా డే వేడుకల్లో భాగంగా యువత, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తూ దాదాపు 300 మందితో ఒకేసారి యోగా చేయించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.